సాక్షి ప్రకాశం

శనివారం । 28 । జూన్ । 2025



పాత సామాను సొమ్ము స్వాహా

దర్శి గురుకుల పాఠశాలలో ఉన్న పాత సామాను దాదాపు 5 ఆటోల వరకు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విక్రయించాడు. - 8లో..



బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి

సబ్సిడీ రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. బ్యాంకర్లతో సమావేశంలో ఆమె మాట్లాడారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

మాదిగ మహామేళాను జయప్రదం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగులుప్పలపాడు: జూలై 7వ తేదీ ఒంగోలులో జరిగే మాదిగ మహామేళాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ అయిన మండలంలోని ఈదుమూడి గ్రామంలో శుక్రవారం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో సాధించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలై 7 వ తేదీ పురిగడ్డ అయిన ఈదుమూడిని స్మరించుకుంటూ ఒంగోలులో 31 ఆవిర్భావ దినోత్సవాన్ని, మాదిగ మహామేళాను నిర్వహిస్తారన్నారు. ఈ మేళాను మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గరటయ్య, రోశయ్య, ముంగర నాగార్జున, నాగేశ్వరరావు, మున్నంగి డేవిడ్ పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను గుర్తించాలి

ఒంగోలు సబర్బన్: బడిబయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్చే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా విద్యా శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సమక్షంలో సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో సమావేశం నిర్వహించి మండల విద్యాశాఖాధికారులు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్ అధికారులు వారి పరిధిలోని సీఆర్ ఎంటీలు, ఐఈఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను ఎన్యుమరేటర్లుగా నియమించి బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. అలాంటి వారిని గుర్తించి వారిని వారి వయసుకు తగిన తరగతిలో చేర్చాలని, ప్రతి సచివాలయ పరిధిలో ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఎస్ఆర్‌కేవీఎం కిట్లు, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు, అణగారిన వర్గాలకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి కేటాయింపు, తల్లికి వందనం తదితరాల గురించి పేరెంట్ కమిటీల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేయించాలన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అడ్మిషన్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా జూలై 12వ తేదీ నాటికి పూర్తి చేయలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో సర్పం..



పామును బయటకు తీస్తున్న నిరంజన్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని జీజీహెచ్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టరులోకి శుక్రవారం ఉదయం ఒక పాము దూరి టెన్షన్‌కు గురిచేసింది. డ్రైవర్ ట్రాక్టరు ఎక్కి స్టార్ట్ చేయబోగా ఇంజన్ నుంచి ఒక్కసారిగా పాము బయటకు రావడంతో భయపడి కిందకు దిగిపోయాడు. పామును బయటకు తీసేందుకు డ్రైవర్ చేసిన ప్రయత్నం విఫలం కావడంతో స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారం ఇచ్చారు. ఇంజన్ బాయినెట్ ఓపెన్ చేసిన స్నేక్ క్యాచర్.. లోపల ఉన్నది సెట్రిక్ పాముగా గుర్తించారు. మూడున్నర అడుగుల పొడవున్న పామును బయటకు తీసి సురక్షితంగా వదిలేశారు.

విశ్వ బ్రాహ్మణ సంఘ జిల్లా కార్యదర్శిగా శివశంకరాచారి



ముత్తలూరి శివశంకరాచారి

పెద్దదోర్నాల: విశ్వ బ్రాహ్మణ సంఘ జిల్లా కార్యదర్శిగా ముత్తలూరి శివశంకరాచారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎంపికైన ముత్తలూరి శివశంకరాచారి మాట్లాడుతూ తనను కార్యదర్శిగా నియామకం చేసిన విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుమూడి రవిప్రసాద్, దద్దోజు విశ్వనాథాచారి, కోశాధికారి రాచర్ల శేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చరిత్ర నేలమట్టం.. పాలక ద్రోహం..

నగరం నడిబొడ్డున ఉన్న రూ.కోట్ల విలువజేసే ఉర్దూ స్కూలు స్థలంపై పచ్చపార్టీ నేతలు కన్నేశారు. ఎనిమిది దశాబ్దాలుగా ముస్లిం విద్యార్థులకు ఈ స్కూల్ సేవలందించింది. పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకుంది. దానిని పునర్నిర్మించి అందుబాటులోకి తేవాల్సిన పాలకులు.. అందుకు విరుద్ధంగా స్వాహా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ స్కూలు కోసం పలు దఫాలుగా ముస్లింలు ఆందోళనలు కూడా చేశారు. అయినా పట్టించుకోని పాలకులు నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేసి గుట్టుచప్పుడు కాకుండా కూల్చేశారు. దీనిపై ముస్లిం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. స్కూలును పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నాయి.

- తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఉర్దూ స్కూల్ భవనం కూల్చివేత
- 1938లో బ్రిటీష్ పాలకులచే నిర్మాణం
- నేడు ఈ స్థలం విలువ రూ.35 కోట్లు
- కన్నేసిన పచ్చనేతలు
- నగరపాలక సంస్థలో తీర్మానం
- పెట్రోల్ బంక్ ఏర్పాటుకు యత్నాలు
- గుట్టుచప్పుడు కాకుండా భవనాన్ని నేలమట్టం చేసిన కార్పొరేషన్ అధికారులు
- భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపణలు
- ఉర్దూ స్కూలును పునరుద్ధరించకుంటే ఉద్యమిస్తామంటూ ముస్లిం సంఘాల హెచ్చరిక



కోటవీధి వద్ద ఉన్న ఉర్దూ స్కూల్‌ను పడగొట్టి చదును చేసిన స్థలం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

బ్రిటీష్ ప్రభుత్వం 1938వ సంవత్సరంలో స్థానిక ప్రజల విద్యాభివృద్ధి కోసం జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరం 23వ డివిజన్ పరిధిలోని కోనేటి వీధిలో 21 సెంట్ల విస్తీర్ణంలో మహ్మద్ ఖాసీం సాహెబ్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఆ పాఠశాల దశాబ్దాల పాటు విజయవంతంగా కొనసాగింది. ఈ ఉర్దూ స్కూల్లో వేలాది మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. కాలక్రమంలో ప్రభుత్వాలు, అధికారుల నిర్లక్ష్యానికి ఈ స్కూల్ బలైపోయింది. స్కూల్ అభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. కనీస సదుపాయాలు కూడా కల్పించలేదు. దీంతో 12 ఏళ్లగా స్కూల్ శిథిలావస్థకు చేరుకుంది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ పాఠశాల భూమిపై కూటమి పాలకులు కన్నేశారు. ఎలాగైనా సరే దీన్ని సొంతం చేసుకోవాలని పన్నాగం పన్నారు. గత నెల మే 2వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ స్కూలును పడగొట్టేందుకు తీర్మానం చేశారు. మందబలంతో కౌన్సిల్‌లో అనుమతి పొందారు. ఇక వ్యూహం ప్రకారం ఉర్దూ స్కూలును పడగొట్టారు. దీని విలువ ప్రస్తుతం మార్కెట్లో సుమారు రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్లు. ఇంత విలువైన ఈ స్థలాన్ని కాజేయడానికి పచ్చపార్టీ నేతలు దొడ్డిదారిలో పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఉర్దూ పాఠశాల స్థలం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం సంఘాల నాయకులు

పెట్రోలు బంకు పెట్టేందుకు ప్రయత్నాలు...

ఉర్దూ స్కూలు పడగొట్టిన కూటమి పాలకులు ఇక్కడ పెట్రోలు బంకు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీకి చెందిన ఒక వ్యాపారవేత్త ఇందు కోసం భారీ మొత్తంలో ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముడుపులతో పాటుగా పెట్రోలు బంకులో ఉచితంగా వాటా ఇవ్వడానికి ఒప్పందం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు నెలలుగా ఈ వ్యవహారం నడుస్తోందని, పక్కా ప్రణాళిక ప్రకారమే ముందు కౌన్సిల్‌లో తీర్మానం చేసి స్కూలు కూలగొట్టినట్లు చెప్పుకుంటున్నారు.

స్కూలు పునరుద్ధరణ కోసం పోరాటాలు..

నగరంలో సుమారు 30 వేల మందికిపైగా ముస్లిం జనాభా ఉన్నారు. జిల్లాలో ఒంగోలుతో పాటు మార్కాపురం, కంభం, కనిగిరి, యర్రగొండపాలెం, దోర్నాల తదితర ప్రాంతాల్లో ఉర్దూ స్కూళ్లు ఉన్నాయి. ఒంగోలులో ఉన్న ఉర్దూ స్కూలు శిథిలావస్థకు చేరుకుంది. దాంతో నగరంలోని ముస్లింలు కొన్నేళ్లుగా ఉర్దూ స్కూలును పునరుద్ధరించాలని వివిధ మార్గాల్లో పోరాటాలు చేస్తున్నారు. సమయం వచ్చినప్పుడల్లా ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నారు. 2022లో ఈ స్థలాన్ని కమర్షియల్‌గా మార్చాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసేందుకు కొంత మంది కార్పొరేటర్లు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ముస్లిం సంఘాలు దాన్ని వ్యతిరేకిస్తూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ముస్లింల మనోభావాలను గౌరవించిన నాటి జగన్ ప్రభుత్వం.. వెంటనే కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు ఈ స్కూలు స్థలంపై కన్నేశారు. ఒక పథకం ప్రకారం నేలమట్టం చేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉర్దూ స్కూలును పడగొట్టే ముందు మాటమాత్రమైనా ముస్లిం సంఘాల నేతలతో చర్చించలేదు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఉర్దూ స్కూలు నేలమట్టమైంది. దీని వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. స్కూలు భవనం కూల్చివేతపై గురువారం పలు ముస్లిం సంఘాల నేతలు ఆందోళన చేశారు. స్కూలును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ముస్లిం సమాజాభివృద్ధికి కేటాయించాలి



ఒంగోలు నగరం నడిబొడ్డున ఉన్న ఉర్దూ స్కూలు స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కొనసాగుతోంది. దీనిని పడగొట్టి కమర్షియల్‌గా మార్చేందుకు 2022లో కౌన్సిల్‌లో తీర్మానం చేయడానికి ప్రయత్నించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించాను. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిని పడగొట్టారు. ఇప్పుడు కూడా ఈ విషయాన్ని వ్యతిరేకిస్తున్నాను. నగరంలోని ముస్లింల మనోభావాలను గౌరవిస్తూ ఉర్దూ స్కూలు స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి. ఈ స్థలాన్ని ముస్లిం సమాజాభివృద్ధి కోసమే వినియోగించాలి.

– ఎండీ ఇమ్రాన్ ఖాన్,
నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్

ఉర్దూ స్కూలును పునర్నిర్మించాలి



ఉర్దూ స్కూలును పడగొట్టడంతో నగరంలోని ముస్లిం సమాజం మొత్తం ఆందోళన చెందుతోంది. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదు. నగరంలో 30 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారు. వారికి ఉర్దూ స్కూలు లేదు. ముస్లింల విద్యాభివృద్ధి కోసం ఉర్దూ స్కూలును పునరుద్ధరించాలని కొన్నాళ్లుగా పోరాటాలు చేస్తున్నాం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పడగొట్టిన చోటనే ఉర్దూ స్కూలును పునర్నిర్మించాలి. ఇది ముస్లింల ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం.

– సయ్యద్ ఇస్మాయిల్,
ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు

ముస్లిం శ్మశాన వాటిక రద్దుకూ విఫలయత్నం

ముస్లిం శ్మశాన వాటిక కోసం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన 2 ఎకరాల స్థలాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రద్దు చేసేందుకు విఫలయత్నం చేసింది. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కమ్మపాలెంలో జరిగిన ఒక సభలో ముస్లింలకు కేటాయించిన శ్మశాన వాటికను రద్దు చేసి కమ్మపాలెం వాసుల కోసం పార్క్ నిర్మిస్తానని ఎమ్మెల్యే బహిరంగంగా ప్రకటించడంతో ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఆందోళనకు సిద్ధమయ్యాయి. దాంతో ఉలిక్కిపడిన కూటమి పాలకులు పోలీసులను రంగంలోకి దించారు. ర్యాలీ నిర్వహించకుండా ఒత్తిడి చేశారు. చివరికి ప్రెస్ మీట్ పెట్టేందుకు ముస్లిం ప్రజాసంఘాలు ప్రయత్నిస్తే దాన్ని కూడా అడ్డుకున్నారు. ఆ తర్వాత ముస్లింల మనోభావాలను ఏ మాత్రం లెక్క చేయకుండా శ్మశాన వాటిక స్థలాన్ని రద్దు చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానానికి ప్రయత్నాలు చేశారు. సమావేశం జరుగుతున్న సమయంలో ముస్లింలు, సీపీఎం అనుబంధ ఆవాజ్ ధర్నాకు దిగడంతో పాటు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ కౌన్సిల్‌లో గట్టిగా వ్యతిరేకించడంతో కూటమి పాలకులకు దిమ్మతిరిగింది. శ్మశాన వాటిక స్థలాన్ని రద్దు చేయాలన్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఆ విషయం మరిచిపోకముందే తిరిగి ఇప్పుడు ఉర్దూ స్కూలును కూల్చివేయడం ముస్లింలకు మింగుడు పడటంలేదు. కూటమి పాలకుల కబ్జా కోరల నుంచి ఉర్దూ స్కూలును కాపాడుకునేందుకు నగర ముస్లిం సంఘాలు సిద్ధమవుతున్నాయి.

ఆగుతూ సాగిన వేలం

- టంగుటూరు వేలం కేంద్రంలో అత్యధిక ధర రూ.282 పడిందంటూ వేలం బహిష్కరించిన బయ్యర్లు
- అనంతరం గిట్టుబాటు ధర లేక వేలం నిలుపుదల చేసిన రైతులు
- చివరికి అధికారుల చొరవతో సాయంత్రానికి పూర్తయిన వేలం



కొండపిలో రైతులతో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు

టంగుటూరు: పొగాకు వేలం కేంద్రాల్లో సరైన గిట్టుబాటు ధర దక్కడం లేదంటూ రైతులు వేలం బహిష్కరించి నిరసన తెలుపుతుంటారు.. కానీ అందుకు భిన్నంగా అత్యధిక ధరలు నమోదయ్యాయంటూ కంపెనీ బయ్యర్లు వేలం బహిష్కరించిన ఘటన టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టంగుటూరు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు పొగాకు బేళ్ల తీసుకొచ్చారు. వేలం ప్రక్రియ మొదలు పెట్టి సుమారు 120 పొగాకు బేళ్ల కొనుగోలు చేయగా 10 పొగాకు బేళ్లకు రూ.281, రూ.282 అత్యధికంగా నమోదయ్యాయని వాటిని సీలింగ్ ధర రూ.280గా మార్చాలని బయ్యర్లు పట్టుబట్టారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అందుకు అంగీకరించలేదు. దీంతో అత్యధిక ధరలు తీసేస్తేనే వేలంలో పాల్గొంటామని బయ్యర్లు పట్టుబట్టి వేలం బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. దీంతో గంటపాటు వేలం ప్రక్రియ నిలిచిపోయింది. వేలం నిర్వహణాధికారి బయ్యర్లతో చర్చించి ఆ పది బేళ్లను కూడా రూ.280 గా మార్చేలా అంగీకరించడంతో బయ్యర్లు వేలం కొనసాగించారు. అయితే తిరిగి వేలం ప్రారంభమైన తరువాత నాణ్యమైన బేళ్లను కూడా ధర తగ్గించి రూ.275 కే కొనుగోలు చేస్తున్నారని రైతులు నిరసన వ్యక్తం చేస్తూ వేలాన్ని నిలిపేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి 2 గంటల వరకు వేలం నిలిచిపోయింది. ఈక్రమంలో పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు కంపెనీ బయ్యర్లు, రైతులతో చర్చించి సరైన ధరలు అందించాలని, తిరస్కరణలు లేకుండా చూడాలని సూచించడంతో వేలం మళ్లీ ప్రారంభమై గం.2.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగింది. అసలే గిట్టుబాటు ధరలు లేక నానా ఇబ్బందులు పడుతుంటే పొగాకు కంపెనీ బయ్యర్లు వేలం నిలపటం ఏమిటంటూ రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రైతులు మొత్తం 868 బేళ్ల వేలానికి తీసుకురాగా వాటిలో 729 కొనుగోలు చేశారు. 139 తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.230.57 పలికింది. వేలంలో మొత్తం 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.



టంగుటూరులో వేలం నిలిచిపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న పొగాకు వేలం కేంద్రం

300 బేళ్లను తిరస్కరించిన వ్యాపారులు

కొండపి: రైతుల దగ్గర ఉన్న లో గ్రేడ్ పొగాకు ను కొనుగోలు చేయాలని 7వ రౌండ్ ప్రారంభమైన గురువారం రోజు రైతులు వేలాన్ని నిలిపివేసి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గురువారం జువ్విగుంట, అయ్యవారిపాలెం తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1175 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. 80 బేళ్లకు వేలం నిర్వహించగా 26 బేళ్లకు వ్యాపారులు నోబిడ్లు పెట్టారు. వేలం నిలిచిపోవడంతో అదే బేళ్లకు శుక్రవారం రైతులు, వ్యాపారులతో రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు, బోర్డు అధికారులు చర్చలు జరిపారు. అనంతరం వేలం ఆలస్యంగా ప్రారంభించారు. 1095 బేళ్లకు వేలం నిర్వహించగా అందులో 795 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 300 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.243.21 పలికిందని వేలం నిర్వహణాధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. వేలంలో 23 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ఎం మాట్లాడినా తీరు మార్చుకోని వ్యాపారులు:

రైతులు వేలానికి తీసుకొచ్చే అన్ని గ్రేడ్‌ల పొగాకును కొనుగోలు చేయాలని వేలం ప్రారంభానికి ముందు వ్యాపారులకు ఆర్ఎం లక్ష్మణరావు సూచించారు. అయితే వేలం ప్రారంభమైన తర్వాత వ్యాపారులు రైతుల దగ్గర ఉన్న లోగ్రేడ్ బేళ్లను అధిక సంఖ్యలో తిరస్కరించారు. దాదాపు 300 పొగాకు బేళ్లను రైతులు తిరిగి తమ ఇళ్లకు తీసుకెళ్లారు. ఆర్ఎం వచ్చి చర్చలు జరిపినా ఉపయోగమేమీ లేదని, నామమాత్రపు చర్చలతో తమ కష్టాలు తీర్చలేరని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రేయ్.. పొద్దున్నే తాగి వచ్చావా..

- పొగాకు రైతుపై సూపరింటెండెంట్ దురుసు వ్యాఖ్యలు
- నిరసన తెలిపిన రైతులు

కనిగిరిరూరల్: పొగాకు రైతు పట్ల కనిగిరి టుబాకో బోర్డు సూపరింటెండెంట్ వ్యవహరించిన దురుసు ప్రవర్తనను నిరసిస్తూ.. శుక్రవారం బోర్డు లోపల పొగాకు రైతులు నిరసన తెలిపి ఆర్ఎంకు ఫిర్యాదు చేశారు. బాధిత పొగాకు రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పొగాకు బోర్డులో పామూరు క్లస్టర్ పరిధిలోని వెంకటాపురానికి చెందిన రైతు కొరె శివారెడ్డి క్లస్టర్‌లో తొలుత తన గ్రామానికి, తనకు చెందిన 30 బేళ్లను వేలానికి వరుస క్రమంలో పెట్టారు. వేలం ప్రారంభించిన అధికారులు 30 బేళ్లలో 15 వరకు నోబిడ్‌గా తిరస్కరించారు. చివరి బేళ్లు ఉన్న సమయంలో గమనించిన రైతులు ''సార్.. ఇప్పటికి పది రౌండ్లు ముగిశాయి.. పొగాకు బేళ్లు ఇళ్లల్లోనే మగ్గుతున్నాయి. కనిష్ట ధర కూడా తగ్గించారు. కనీసం నోబిడ్ పెట్టకుండా అన్ని రకాల బేళ్ల కొనుగోలు చేయండి లేకుంటే ఆక్షన్ ఆపండి'' అంటూ కొరే శివారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేసిన సూపరింటెండెంట్.. ''రేయ్ పొద్దున్నే తాగి వచ్చావా.. నీ బిడ్డింగ్ అసలు కొనుగోలు చేయము'' అంటూ దురుసుగా మాట్లాడాడు. దీంతో కంగుతిన్న రైతు కొరే శివారెడ్డి ''సార్ నాకు మందు అలవాటు లేదు.. మీరు అలా మాట్లాడటం సరైంది కాదు.. నేను ఏడు బ్యార్న్‌ల పెద్ద రైతును మీరు నా పట్ల ఇలా అనవసరంగా నోరు పారేసుకున్నారు. ఇది సరైన పద్ధతి కాదు'' అంటూ ప్రశ్నించారు. దీంతో రైతు కొరే శివారెడ్డికి మిగతా రైతులు కూడా మద్దతు పలికారు. కొద్ది సేపు ఆక్షన్ నిలిపేశారు. ఈమేరకు రైతులంతా కలిసి ఆర్ఎం కు ఫోన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బయ్యర్లు ఈ సారి అలా జరగకుండా అన్ని బేళ్ల కొనుగోలు చేస్తామని రైతులకు సర్దిచెప్పడంతో వేలం యథావిధిగా సాగింది.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని రైతుల నిరసన

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పండించిన పంటను కొనుగోలు చేయాలని అడిగిన రైతు కొరే శివారెడ్డిపై దురుసుగా వ్యవహరించిన ఆక్షన్ సూపరింటెండెంట్ కోటేశ్వరావుపై చర్యలు తీసుకోవాలని, రైతు శివారెడ్డికి .. బోర్డు అధికారి క్షమాపణలు చెప్పాలని రైతులు నిరసనలు తెలిపారు. ఈమేరకు ఆర్ఎంకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. రైతులకు అండగా నిలవాల్సిన బోర్డు అధికారి కంపెనీ ప్రతినిధులకు తొత్తుగా మారి.. వారితో లాలూచీ పడి రైతు పట్ల అనుచితంగా వ్యవహరించిన బోర్డు సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పొగాకు రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరును రైతులు, రైతు సంఘాల నాయకులు ఖండిస్తున్నారు. కనిగిరి టుబాకో బోర్డులో శుక్రవారం జరిగిన వేలంలో పామూరు క్లస్టర్ పరిధిలోని రైతులు 552 బేళ్లు తీసుకుని రాగా.. 224 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280 పలుకగా, కనిష్ట ధర రూ.150కు దిగజారింది.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకుడు

నాగులుప్పలపాడు: మండలంలోని మాచవరం గ్రామంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర రాష్ట్ర పరిశీలకుడు పి.రమేష్ శుక్రవారం పర్యటించి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన విద్యామిత్ర కిట్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మెగా తల్లిదండ్రుల సమావేశాలకు తల్లిదండ్రులను తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.శివరామ్ ప్రసాద్, పీడీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల తనిఖీ


తురిమెళ్లలో పనులు తనిఖీ చేస్తున్న సెంట్రల్ టీమ్

కంభం: జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా 2022–23వ సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను శుక్రవారం కేంద్ర బృందం తనిఖీ చేసింది. కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో చెలమ కొండలో చేసిన ఖండిత కందకాల పనులను తనిఖీ చేసి, ఉపయోగంలో ఉందో లేదో తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి, డీఆర్‌పీ పి.ఇజ్రాయేలు, బేస్తవారిపేట ఏపీడీ భాస్కర రావు, ఏపీఓ జీవరత్నం, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లిలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న చిన్నపురెడ్డి గోవిందరెడ్డిని అరెస్ట్ చేసినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. గోవిందరెడ్డికి మామిళ్ల శ్రీనివాసులు గంజాయి విక్రయించాడని, విచారణ అనంతరం ఇద్దరిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. 25 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు చెప్పారు. నాటుసారా, గంజాయి విక్రయాలపై సమాచారం తెలిస్తే చెప్పాలని సీఐ కోరారు.

పరిశ్రమలకు రాయితీలు మంజూరు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని వివిధ పరిశ్రమలకు సంబంధించి రాయితీలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి 63 క్లెయిములకుగాను రూ.93.32 లక్షలు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పరిశ్రమలకు సంబంధించిన 16 శాఖల అనుమతి కోసం వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఒంగోలు రాంప్ స్కీమ్ ద్వారా జిల్లాలో 4 నియోజకవర్గాల్లో నిర్వహించిన ఉద్యమ్ వర్క్‌షాప్, పీఎంఈజీపీ పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాస రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడవిలో తప్పిపోయిన వ్యక్తి

● రాచర్ల చేరుకోవడంతో కథ సుఖాంతం


రమేష్‌తో ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: మండలంలోని అనుములపల్లె గ్రామానికి చెందిన యేలం రమేష్ అనే యువకుడు తన తండ్రి పుల్లయ్యతో కలిసి గురువారం ఉదయం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి కట్టె పుల్లల కోసం వెళ్లాడు. తండ్రీకొడుకులు ఒకేసారి ఇంటికి బయలుదేరారు. అయితే ముందుగా ఇంటికి చేరుకున్న తండ్రి.. వెనుకే ఉన్న తన కుమారుడు ఎంతకీ రాకపోవడంతో అటవీ ప్రాంతానికి వెళ్లి వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో శుక్రవారం ఉదయం ఎస్సై పి.కోటేశ్వరరావు అటవీ ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. డ్రోన్ కెమెరాలతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రమేష్ అటవీ ప్రాంతం నుంచి రాచర్లకు చేరుకున్నాడని సమాచారం తెలియడంతో అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాత సామాను సొమ్ము స్వాహా..!


పాత సామగ్రితో గురుకుల పాఠశాలలో సిద్ధంగా ఉన్న ఆటో


ఆటోలకు ఎత్తేందుకు సిద్ధంగా ఉన్న ఇనుప పెట్టెలు

● దర్శి గురుకుల విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వింతపోకడ
● విద్యాలయంలోని పాత సామగ్రి విక్రయించగా వచ్చిన సొమ్ము కాజేసినట్లు ఆరోపణలు
● ముక్కున వేలేసుకుంటున్న సిబ్బంది

దర్శి (కురిచేడు):

దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు వింతపోకడకు తెరలేపారు. ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువులు మరమ్మతులకు గురైతే వాటిని ప్రభుత్వ అనుమతితో విక్రయించి వచ్చిన నగదుకు సంబంధించి ప్రభుత్వానికి లెక్కచెప్పాల్సి ఉంది. కానీ, గురుకులంలోని ఒక ఉద్యోగిని అడ్డం పెట్టుకుని గురుకుల పాఠశాలలో ఉన్న పాత ఇనుప సామగ్రి, మోటార్లు, పాత పెట్టెలు, పుస్తకాలు మొత్తం సుమారు 5 ఆటోల వరకు ఉన్నతాధికారులు, ప్రభుత్వ అనుమతి లేకుండా మాధవరావు విక్రయించారు. వచ్చిన నగదును తన ఖాతాలో జమచేసుకుని స్వాహా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటి గురించి పాఠశాల అభివృద్ధి కమిటీకిగానీ, సొసైటీ పెద్దలకుగానీ తెలియజేయలేదని సమాచారం. పనికిరాని పాత సామగ్రినే కాకుండా పనికొచ్చే రెండు ట్రాలీలను కూడా విక్రయించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పిల్లలకు వంట తయారు చేసేందుకు ఉపయోగించిన గిన్నెలను ట్రాలీపై ఉంచి నెట్టుకుని తీసుకెళ్లి అన్నం వడ్డించాలి. ఇందుకోసం పాఠశాలకు ట్రాలీలు సరఫరా చేశారు. వాటిలో రెండు ట్రాలీలను కూడా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విక్రయించినట్లు సమాచారం.

విద్యార్థులకు సీట్ల కేటాయింపు, తదితర విషయాల్లోనూ చేతివాటం...

విద్యార్థులకు సీట్ల కేటాయింపులోనూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చేతివాటం ప్రదర్శించినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాడు–నేడు పనుల్లోనూ సరిగ్గా లెక్కలు చూపకుండా, పనిచేసిన వారికి కూలి ఇవ్వకుండా అటెండర్లు, తనకు అనుకూలమైన సిబ్బంది ఖాతాలకు నగదును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బదిలీ చేసినట్లు కొందరు సిబ్బంది ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టాల్సిన చికెన్ కూడా సగం పెట్టి మిగతా సగానికి సంబంధించిన సొమ్ము స్వాహా చేస్తున్నాడని చర్చించుకుంటున్నారు. పాఠశాలలో విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యత లేకపోవడంతో తినలేక పడేస్తున్నారని, చద్దన్నం, రుచిలేని కూరలతో పెట్టడంతో కొంతమంది అనారోగ్యం పాలయ్యారని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులను మచ్చిక చేసుకుని సొసైటీ వారు, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలనకు వచ్చినప్పుడు వారితో ఎలా మాట్లాడాలో శిక్షణ ఇచ్చి తద్వారా పై అధికారుల వద్ద మార్కులు కొట్టేస్తున్నాడని సిబ్బంది, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న పాత్రికేయులు పాఠశాలను పరిశీలించేందుకు అనుమతి కోరగా, అవకతవకలు బయటపడతాయనే భయంతో నిరాకరించారు. పాఠశాలలో మరుగుదొడ్లను విద్యార్థులతో శుభ్రం చేయిస్తున్నారని తల్లిదండ్రులకు తెలియడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో అపరిశుభ్రత వలన అంటువ్యాధులు ప్రబలుతున్నా వైద్యపరీక్షలు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై గతంలో కలెక్టర్, డీసీఓకు కొందరు ఫిర్యాదు చేసినా అతని ప్రవర్తనలో మార్పురాలేదని, ఉన్నతాధికారులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని సిబ్బంది తెలిపారు. సొసైటీ కార్యదర్శికి కూడా ఇటీవల ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ వద్ద ఉన్న ఆధారాలతో కోర్టును ఆశ్రయిస్తామని కొందరు సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవరావును వివరణ కోరేందుకు సాక్షి ఫోన్ చేయగా, ఆయన సమాధానం ఇవ్వలేదు.


ఆటోకు లోడ్ చేసిన పాత సామాన్లు


ఆటోలో నింపిన పుస్తకాలు

వీరయ్య హత్య కేసు నిందితులు

పరారీకి యత్నం

● తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు
● ముగిసిన పోలీసు కస్టడీ, జిల్లా జైలుకు తరలింపు

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులు పరారీకి ప్రయత్నించినట్లు తాలూకా పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... వీరయ్య హత్య కేసు విచారణలో భాగంగా ఈ నెల 24వ తేదీ నలుగురు నిందితులను పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్న సంగతి తెలిసిందే. వీరయ్యను హత్య చేసిన తరువాత ఇద్దరు నిందితులు మంగమూరు రోడ్డు నుంచి పారిపోయారు. మార్గం మధ్యలో ఒక కాలువలో నిందితులు తమ దుస్తులను పడేసినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. దీంతో విచారణలో భాగంగా నిందితులైన ఓబిలి నాగరాజు, గోళ్ల రుత్యేంద్ర బాబులను శుక్రవారం మధ్యాహ్నం లింగారెడ్డి అపార్ట్‌మెంట్ వీధి చివర మంగమూరు రోడ్డు కలిసే ప్రాంతంలోని కాలువ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నిందితులు దుస్తులు పడేసిన పరిసరాలను పరిశీలించారు. తిరిగి వచ్చే సమయంలో నిందితులను పోలీసు జీప్ ఎక్కిస్తుండగా నాగరాజు, రుత్యేంద్ర బాబులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులను నెట్టివేసి కొంత దూరం పరిగెత్తారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ఈ ఘటనపై గార్డ్ ఇన్‌చార్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు.

నాలుగు రోజులుగా విచారణ:

వీరయ్య చౌదరి హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులు బూరగుంట్ల వినోద్ కుమార్, ఓబిలి నాగరాజు, ఆళ్ల సాంబశివరావు అలియాస్ సిద్ధాంతి, దుత్యేంద్ర బాబు అలియాస్ నానిలను ఈ నెల 24వ తేదీ పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. వినోద్ కుమార్, సాంబశివరావు హైదరాబాద్ వెళ్లి ముప్పా సురేష్‌ను కలిసినట్లు, ఆ సమయంలో సురేష్ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని డీఎస్పీ శ్రీనివాసరావుకు తెలిపినట్లు సమాచారం. ముప్పా సురేష్ తన వ్యాపార సంస్థలో పనిచేసే డైరెక్టర్ ద్వారా వినోద్ కుమార్‌కు లక్ష రూపాయలు ఆన్‌లైన్లో ట్రాన్సాక్షన్ చేసినట్లు నిందితులు చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా శుక్రవారం నిందితుల పోలీసు కస్టడీ ముగిసింది. వారిని సాయంత్రం వైద్య పరీక్షల అనంతరం జిల్లా జైలుకు తరలించారు.

బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి

● ఈ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల రుణ లక్ష్యం రూ.25,045.91 కోట్లు
● బ్యాంకర్ల కమిటీ సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా


క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు, అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, పీఎం సూర్యఘర్ యోజన పథకం లబ్ధిదారులకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.25,045.91 కోట్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.20,591.18 కోట్లుగా నిర్ణయించగా, 2025 మార్చి 31వ తేదీ నాటికి రూ.25,444.91 కోట్ల రుణాలు అందజేశారన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్‌లో రూ.4197.42 కోట్లు, రబీలో రూ.6040 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారన్నారు. జిల్లాలో పశు, మత్స్య సంపదను వృద్ధి చేసేలా రుణాలు అందజేయాలని కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమేష్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాసులు, రవి కుమార్, శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున నాయక్, సీపీడీసీఎల్ ఎస్.ఈ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని జిల్లా బ్యాంకు కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకేది కనీస మర్యాద?


రైతుల కోసం గతంలో ఏర్పాటు చేసిన అరుగులివే..


పరిపాలన భవనంపై అతిథి గృహం

పొదిలి: రైతుల కష్టంపై వచ్చే ఆదాయంతో నిర్వహించే పొగాకు వేలం కేంద్రంలో ఆ కష్ట జీవులు కునుకు తీసేందుకు సరైన సౌకర్యం లేదు. పొదిలి వేలం కేంద్రానికి రోజూ 200 నుంచి 300 మంది రైతులు వస్తుంటారు. వేలానికి ముందు రోజు రాత్రే బేళ్లతో చేరుకునే రైతులు కునుకు తీసేందుకు అపసోపాలు పడాల్సిన దుస్థితి. నాపరాళ్ల అరుగులపై నడుం వాల్చేందుకు ఇష్టపడని రైతులు ఆరుబయట ఫ్లోరింగ్‌పై నిద్రకు ఉపక్రమిస్తున్నారు. కొందరు రైతులు కటిక నేలపై పడుకోలేక లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఆ నాపరాళ్ల అరుగుల గదిని బీహార్ ముఠా కార్మికులకు అప్పగించడంతో స్థానిక రైతులు కునుకు తీసే అవకాశమే లేకుండా పోయింది. బోర్డు ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు బస చేసేందుకు పరిపాలనా భవనంపై సర్వ హంగులతో అతిథి గృహం నిర్మించారు కానీ రైతులకు కనీస వసతి లేకుండా చేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

దీపావళి నాటికి టిడ్కో ఇళ్లు

● ఒంగోలులో రోడ్డు విస్తరణలో నష్టపోయే వారికి టీడీఆర్ బాండ్స్
● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ

ఒంగోలు సబర్బన్: టిడ్కో ఇళ్లకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేసి దీపావళి నాటికి లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి.నారాయణ తెలిపారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి సంబంధించిన కార్యకలాపాలపై సమీక్షించేందుకు శుక్రవారం ఆయన ఒంగోలు వచ్చారు. ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. అనంతరం సంబంధిత వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. టిడ్కో ఇళ్లను 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణమైనవిగా మూడు కేటగిరీలుగా చేపట్టినట్లు చెప్పారు. వీటిలో 365, 430 చదరపు అడుగుల ఇళ్లను ముందుగా పూర్తిచేసి దీపావళి నాటికి లబ్ధిదారులకు అందిస్తామని ప్రకటించారు. ప్రకాశం జిల్లాలో మరో 15 రోజుల్లో ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు నిర్మాణ పనులు చేపడతారని ఆయన వెల్లడించారు. ఒంగోలులో రోడ్డు విస్తరణ వలన నష్టపోయే వారికి టీడీఆర్ బాండ్స్ ఇస్తామని ప్రకటించారు. సమీక్షలో మార్కాపురం ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి, ఒంగోలు నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

ఐదు గ్రానైట్ లారీలు సీజ్


గనులశాఖ అధికారులు సీజ్ చేసిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా గనుల నుంచి అక్రమంగా గ్రానైట్ బ్లాకులను తరలిస్తున్న 5 లారీలను సీజ్ చేసినట్లు గనులశాఖ అధికారి రవివర్మ తెలిపారు. శుక్రవారం రామతీర్థం ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ రవాణా చేస్తున్న 5 లారీలను గుర్తించామని పేర్కొన్నారు. లారీలకు జరిమానా విధించి, ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణానికి తరలించామన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

● ఏడాది కాలం పూర్తి చేసుకున్నందుకు అభినందించిన రెవెన్యూ అసోసియేషన్ నాయకులు


కలెక్టర్‌ను కలిసి అభినందిస్తున్న జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: కలెక్టర్‌గా ఏడాది కాలం పూర్తి చేసుకున్న ఏ.తమీమ్ అన్సారియాను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలిసిన రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఉద్యోగులకు అండగా ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్ వింగ్ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు. రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావుతో పాటు జిల్లా కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రశాంత్, ఏపీ జేఏసీ ఉమెన్ వింగ్ చైర్మన్ జయలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, కలెక్టరేట్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

క్రిటికల్ సర్జరీ.. కవలలు సురక్షితం


సర్జరీ తర్వాత కవల పిల్లలను చూపుతున్న డాక్టర్ పద్మావతిబాయి

కంభం: నెలలు నిండక ముందే తీవ్ర రక్తస్రావంతో కంభంలోని సామాజిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన ఓ గర్భిణికి గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతిబాయి సర్జరీ చేసి కవల పిల్లలను సురక్షితంగా బయటకు తీశారు. గిద్దలూరు మండలం క్రిష్ణంశెట్టిపల్లి గ్రామానికి చెందిన జ్యోత్స్న అనే గర్భిణికి గురువారం అర్ధరాత్రి తర్వాత రక్తస్రావమవుతుండటంతో కుటుంబ సభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆమె గర్భం దాల్చి 34 వారాలు నిండాయి. ప్రసవానికి ఇంకా ఆరు వారాల సమయం ఉంది. అయితే గురువారం రాత్రి ఒక్కసారిగా రక్తస్రావం కావడంతో ఆందోళన చెందిన ఆమె.. కుటుంబ సభ్యుల సహకారంతో ఆస్పత్రికి వచ్చింది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అనస్థీషియా వైద్యుడు శివనాయక్‌తో కలిసి గైనకాలజిస్టు సర్జరీ నిర్వహించారు. కవలలతోపాటు తల్లి క్షేమంగా ఉండటంతో వైద్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.